

# బొట్టు

సూర్యణి బొట్టు పెట్టుకొని తూర్పు పొద్దున్నే నిద్ర లేచింది. మేరీ లేవలేదు. రమా లేవలేదు.

ఇద్దరూ ఒకే మంచం మీద, హాస్టల్లో, పడుకొన్నారు.

బెడ్‌కాఫీ వచ్చింది. తలుపు తట్టింది. వాకిట్లో కూర్చుంది.

కాఫీ కేకకి మంచం కదిలింది. మనుషులు కదిలారు.

తలుపు తీస్తే కాఫీ పొగలు కక్కుతూ ఉంది.

ముట్టుకొంటే మండిపడింది. తాగితే నాలుకకు వాతలు పెట్టింది.

బుజ్జగిస్తే చల్లబడింది. తాగుతుంటే ముఖాలు కనిపించాయి.

మాడిపోలేదు.మారిపోయాయి. ఒకరి ముఖం ఒకరు చూచుకొన్నారు.

దిక్కు తెలియలేదు.

రమ మేరీ ముఖం చూచి నుదురు తడుముకొంది.

మేరీ డిటో.

ఇద్దరూ లేచారు. అద్దాన్ని పలకరించారు.

ముందు రమ, మేరీ ముఖం చూచింది.

వెనక మేరీ, రమ ముఖం చూచింది.



రాత్రి పడుకొన్నప్పుడు రమ నుదుట బొట్టు స్టిక్కర్ - ఉంది.

మేరీ ముఖాన బొట్టులేదు. రమ నుదుట నిన్న సాయంకాలం దాకా ఉన్న బొట్టు తెల్లవారే సరికి మేరీ ముఖం మీద ఉదయించింది.

రమ పెట్టింది అనుకొంది మేరీ.

మేరీ తీసి పెట్టుకొంది అనుకొంది రమ.

'ఎందుకు?' ఇద్దరూ ఒకేసారి అడిగారు.

'ఏమిటి?' ఇద్దరూ ఒకేసారి సమాధానం ప్రశ్నించారు.

రమ బొట్టు తీయలేదు. మేరీకి పెట్టలేదు.

మేరీ బొట్టు తీసుకోలేదు. పెట్టుకోలేదు.

బొట్టు మారింది. అక్కడ్నుంచి ఇక్కడకు. ఎలా మారింది?

బొట్టుకు కాళ్ల వచ్చాయా? లేచి వచ్చాయా? నడచి వచ్చాయా? వచ్చీ, బొట్టును ఇక్కడ ప్రతిష్ఠించాయా?

మేరీ అద్దం ముందే కూర్చుంది. లేవలేదు.

బొట్టు చూచింది. ఎర్రగా ఉంది, టార్చిలైటులా ఉంది. సూర్యోదయంలా ఉంది.

స్టిక్కర్ ఏం చేసింది? తారుమారయ్యింది ఎలా?

రమ లేచింది. మేరీ లేచింది. రమ కూర్చుంది. ఎలా?

రమ లేచింది. మేరీ లేచింది రమ కూర్చుంది. అద్దం అందంగా ఉంది.

అద్దం కన్ను గీటింది. రమ ముఖం చూచి నవ్వింది. బొట్టు లేదు.

నుదురు ఉంది. విశాలంగా ఉంది. మీద బొట్టు లేదు. జుట్టు కింద బొట్టు లేదు.

నుదురు అఖండంగా ఉంది. అమోఘంగా ఉంది. విశాలమైన మైదానం.

నుదురు అద్దంలా ఉంది. అద్దమంత నున్నగా ఉంది. ఖాళీగా ఉంది. విశాలంగా ఉంది.

ముఖం ఉంది. అద్దం ఉంది. ముఖమంత విశాలంగా అద్దం ఉంది.

బొట్టు ఉండేచోట చిన్న మచ్చ ఉంది. ఇంత పౌడరు అద్దితే మాయమయింది.

నుదురు ఇసుక బయలులాగా ఉంది.

మచ్చలేని స్వచ్ఛతలాగా ఉంది. మచ్చలేని చంద్రబింబంలాగా ఉంది.

రమకు తన ముఖం తనకే ముచ్చటగా ఉంది. ముద్దుగా ఉంది. ముద్దొస్తూ ఉంది. అద్దంలో ముద్దుపెట్టింది. అద్దం రమను ముద్దు పెట్టుకొంది.

అద్దంలో అందం మంచం మీదకు చేరింది. ఎదురెదురుగా ఇద్దరూ!

ఒకరి ముఖంలోకి ఒకరు!

ఎంత బాగుంది! అనుకొన్నారు. ఎంత బాగుంది అన్నారు.

"నీ ముఖం బాగుంది! అనుకొన్నారు. ఎంత బాగుంది అన్నారు.

'బొట్టుంటే నీ ముఖం కళకళలాడుతూ ఉంది' అంది రమ.

'బొట్టు లేకపోతేనే నీ ముఖం బాగుంది. ఒప్పుకొంది మేరీ.

వాళ్లు వాటేసుకొని పడుకొంటే బొట్టు అక్కడ ఊడి ఇక్కడ అంటుకొందా? ఏమో!

నిద్దట్లో మేరీ పెట్టుకొందా? మగతలో రమ పెట్టిందా? తెలియదు.

మేరీ అద్దం వదలలేదు. కదలలేదు. కన్ను ఆర్పలేదు.

బొట్టు వెలుగుతూ ఉంది. కాంతులు వెదజల్లుతూ ఉంది. వెలుతురు అటూ ఇటూ! ముఖం వెలిగిపోతూ ఉంది.

ముఖంనిండా వెలుగు!

మేరీ ముఖం నవ్వుల ముఖం. వెలుగుల ముఖం. అద్దం ఫోటోలు తీస్తూ ఉంది.

రీళ్లు రీళ్లు!

మేరీ ముఖం నవ్వు ముఖం. వెలుగు ముఖం.బొట్టు ముఖం.

చిన్నప్పటి నుంచి రమకు బొట్టు ఉంది. మేరీకి లేదు.

పాత ఒక రోత

కొత్త ఒక వింత.

రమది రోత కాదు. మేరీది వింత కాదు.

ఇద్దరికీ బొట్టు ఉండటం, లేకుండటం సహజంగా ఉంది.

బొట్టుతో హాస్టల్ అంతా కలదిరిగింది మేరీ.

బొట్టు లేకుండా డైనింగ్ హాలుకు వేంచేసింది రమ.

కొందరు చూశారు. అంటే కొందరు చూడలేదు.

చూచినవాళ్లు గమనించలేదు. గమనించిన వాళ్లు మాట్లాడలేదు.

మొత్తం మీద ఎవరూ ఏమీ అనలేదు.

ఇద్దరికీ ఉత్సాహంగా ఉంది.

పనిలేదు. హాస్టలంతా తిరుగుతున్నారు.

మాట్లాడితే నుదురు కొట్టుకొంటున్నారు.

ఇద్దరూ వేరు వేరుగా తిరిగారు.

రౌండ్స్ పూర్తికాగానే ఓట్లు అడిగే ప్రాపగాండా ముఠాలా ఇద్దరూ కలిసి అందరి రూంలు సర్వే చేస్తున్నారు.

ఎవరో " ఏందిది?" అన్నారు.

కొందరు బాగుందన్నారు.

అందరూ 'సరే పొండి' అన్నారు.

మేరీ, రమా రూం రూంకూ పోతున్నారు వస్తున్నారు.

హాస్టలు సర్వే అయిపోయింది.

కాలేజీకి వెళ్లే టైం అయిపోయింది.

బయలుదేరుతుంటే కాళ్లూ చేతులూ ఆడలేదు.

వాళ్లిద్దరూ కత్తి సుత్తిలాగా ఉన్నారు.

జోడెడ్లులాగా ఉన్నారు.

ఆవూ దూడా లాగున్నారు.

సైకిల్ చక్రాల్లాగా ఉన్నారు.

రమ బొట్టు లేకుండా, మేరీ బొట్టుతో రెడీ అయ్యారు. స్టడీ అయ్యారు. గో అయ్యారు. పోతున్నారు.

రూం దాటారు. వరండా దాటారు. మెట్లు దిగారు. గేటు దాటుతూ ఆగిపోయారు.

మేరీ బొట్టు తీసింది. రమ తీసుకొంది. నుదుట పెట్టుకొంది. సూర్యుడు ట్రాన్స్‌పర్ అయ్యాడు.

క్లాసులో పాఠాలు వినిపించటం లేదు.

నుదుళ్లు కనిపిస్తున్నాయి.

ఇద్దరూ ముఖాలు చూచుకొంటున్నారు.

నుదుళ్లు తడుముకొంటున్నారు.

క్లాసులు వదలటం ఆలస్యం - రూం కొచ్చిపడ్డారు.

రమ బొట్టు తీసింది. ముఖం కడిగింది. అద్దం ముందు చేరింది.

ఈ చీర కట్టింది. మార్చింది. ఆ చీర కట్టింది. అన్ని చీరలూ కట్టింది. విడిచింది. కుప్ప పెట్టింది. అన్ని చీరలకు ముఖం బొట్టు లేకపోయినా మేచ్ అవుతూ ఉంది.

చీరలు కట్టటం, విప్పటం రమ అలసిపోయింది. మంచం మీద అడ్డం పడింది.

మేరీ బొట్టు పెట్టింది. ఆ పైన ముఖం కడిగింది.

అద్దం ముందు చేరింది. అన్ని స్టిక్కర్లు ముందు పెట్టింది.

ఒకటి పెట్టింది. తీసింది. ఇంకొకటి పెట్టింది. తీసింది. అన్నీ పెట్టింది. తీసింది.

రాశి పడ్డ చీరలు కట్టడం, మాచింగ్ బొట్టు పెట్టటం.

చీరలన్నీ కట్టింది. బొట్టులన్నీ పెట్టింది.

కట్టీ, పెట్టీ, చేతులు నొప్పులు పుట్టి మంచం మీద.. మెస్ బెల్ కొట్టారు. వాళ్లు వినలేదు.

మెస్ కడిగారు. తెలియదు.

మెస్ మూశారు. చూడలేదు.

రాత్రంతా వాళ్ల గదిలో బల్బ్ వెలుగుతూ ఉంది.

వాళ్లు చదవటం లేదు.

నిద్ర పోతున్నారు.

ఎట్లా పడ్డవాళ్లు అట్లాగే నిద్రపోతున్నారు.

గది నిండా చీరలు, బొట్లూ సమావేశం ఏర్పాటు చేసుకొన్నాయి. భవిష్యత్ కార్యక్రమం చర్చించుకొన్నాయి.

చర్చలు ముగిసిపోలేదు.

రాత్రి దాటిపోయింది.

పొద్దు నిద్ర లేస్తూ ఉంది.

కాఫీ తలుపు తట్టింది.

ఆకలి నిద్ర లేపింది. ఆవులించారు. లేచి కూర్చున్నారు.

కడుపులో పేగులు సమ్మె చేస్తున్నాయి.

కాఫీ కాలుతూ ఉంది. నాలుకకు వాతలు పెడుతూ ఉంది. పొగలు కక్కుతూ ఉంది. మండిపోతూ ఉంది.

కాఫీకి మర్యాద లేదు.

ఆవురావురుమంటూ తాగారు.

కడుపులో జీవుడు చల్లబడ్డాడు.

అది తమ రూమా? బట్టల షాపు! ఫాన్సీ స్టోరు! సూపరు బజారు.

సర్దారు. రెక్కలు పడిపోయాయి. నిన్నంతా తిరుగుడు. ఒకటే అలుపు. పైగా రెక్కల నొప్పి ఒళ్లంతా మారం. గారాం, మైకం.

స్నానమయింది. టిఫిన్ అయింది. కాలేజీకి సిద్ధమయ్యారు.

రమ బొట్టు తీసింది.

మేరీ పెట్టుకొంది.

గది దాటారు. గడప దాటారు.

ముఖాలు చూచుకొన్నారు.హాస్టల్లో చేరి, ఆర్నెల్లయింది. వారు వీరయ్యారు.

రమ నుదుటి బొట్టు మేరీ ముఖం ఆక్రమించుకొంది.

మెట్లు దిగారు. హాస్టలు దాటారు. గేటు దగ్గరకు వచ్చారు.

ఇద్దరూ గేటు దగ్గర ఆగినట్లు అయింది. తటపటాయించినట్లుగా ఉంది. ముఖం ముఖం చూచుకొన్నారు.

మేరీ బొట్టు తీయబోలేదు.

రమ పెట్టుకోబోలేదు.

బొట్టుతో మేరీ ముఖం వెలిగిపోతూ ఉంది.

బొట్టు తీయకుండా రమ సౌందర్య పరాకాష్ఠగా కనబడుతూ ఉంది.

ఇద్దరూ గేటు దాటారు. రోడ్డెక్కారు. బస్సు ఎక్కారు. కాలేజీలో దిగారు.

మేరీకి బొట్టుంది.

రమకు నిర్మలమైన నుదురు ఉంది.

ఇద్దరికీ నవ్వు ఉంది. ఉత్సాహం ఉంది. హుషారు ఉంది.

ఎవరెస్టు శిఖరం ఎక్కినట్లుంది.

విజయ పతాకం ఎగరవేసినట్లుగా ఉంది.

పైటకొంగులు ఎగురుతుంటే వాళ్లు క్లాసుల్లో కూర్చున్నారు. కాంటీన్‌లో కనిపించారు. లైబ్రరీలో ప్రత్యక్షమయ్యారు. చెట్టు కింద కనిపించారు. బస్ స్టాండ్‌లో దొరికారు.

కాలేజీలో వాళ్లను చాలా మంది చూశారు.

ఒకర్ని మార్చి ఒకర్ని చూశారు. నుదుళ్లు చూశారు. బొట్టు తారుమారు కావటం చూశారు.

జనం చూస్తున్న కొద్దీ వాళ్లు తిరుగుతున్నారు. ఈ ముఖాలు మునుపటివి కావు. మారాయి. నూత్నంగా ఉన్నాయి.

బొట్టు పిలుస్తున్నట్లుంది. నుదురు ఆహ్వానిస్తున్నట్లు ఉంది.

వీళ్లిద్దరూ కాలేజీ అంతా కలబెట్టారు.

ఎగ్జిబిషన్ !షో ! బ్యూటీ కంటెస్ట్! ఫాన్సీ పెరేడ్!

కొందరు విద్యార్థులు చూశారు. ముందుకు వచ్చారు. చూశారు. వెనకబడ్డారు. నడుస్తున్నారు.

ముందువాళ్ళు వెనకబడుతున్నారు. వెనుక వాళ్లు ముందుకు వస్తున్నారు. అందరూ రారు. కొందరు రాకపోరు!

వాళ్లు హాస్టల్ బస్ ఎక్కలేదు.

రోడ్డున పడ్డారు.

వెనుక మందీ మార్బలం. బాడీ గార్డ్స్!

హాస్టలు దాకా వచ్చారు. వదిలి వెళ్లారు.

మేరీ, రమా హాస్టల్‌కి వచ్చారు. రూంలోకి వచ్చారు. ఒకర్నొకరు చూసుకున్నారు. వాటేసుకొన్నారు. వాలిపోయారు. సోలిపోయారు. మంచం మీద పడిపోయారు.

రోజంతా తిరగటం. తోవంతా నడవటం.

హూనం హూనం అయింది వొళ్లు.

వాళ్లకు ఆనందంగా ఉంది.

వాళ్ళు కోరినట్లు హాస్టల్లో తిరిగారు.

వాళ్ల ఇష్టం వచ్చినట్లు కాలేజీలో తిరిగారు.

వాళ్ల ముఖాలు చూచి వెర్రిముఖాలు, తెల్లముఖాలు వేశారు.

బొట్టుతో మేరీ, బొట్టు లేకుండా రమ కాలేజీకి వెళ్ళిరావటం గొప్ప సాహసం. గొప్ప అడ్వెంచర్, గొప్ప ప్రదర్శన, గొప్ప దౌర్జన్యం. గొప్ప విజయం.

శత్రు శిబిరం మీద జెండా ఎగరేసిన సైనికుల ఉత్సాహం.

వాళ్లు అలసిపోయారు. అయినా నిద్ర పట్టలేదు.

విజయగర్వం. ఆనందం, ఊపిరాడని ఉత్సాహం.

ఊళ్లోకి ఇలా పోగలమా? ఆలోచించారు. తప్పకుండా పోతాం!

లోకంలోకి?

నిస్సందేహంగా!

ఎంత కాలం?

ఎల్లకాలం!

వాళ్ల నిర్ణయాలు వాళ్లకెంతో సంతోషం కలిగించాయి.

కాలేజీ చదువు పూర్తి అయిన వెంటనే వాళ్లు పెళ్లి చేసుకొన్నారు.

ఒకరు చేయలేదు.

ఒకరు చేసుకొలేదు.

వీళ్లు చేసుకొన్నారు.

మేరీ భర్తతో గుడికి పోయింది. పూజ చేసింది. టెంకాయ కొట్టింది. గంట కొట్టింది. సాష్టాంగపడ్డది. ప్రసాదం తీసుకొంది. సేవించింది.

రమ భర్తతో చర్చికి పోయింది. బైబిలు చదివింది. పాటలు పాడింది. మోకాళ్లూనింది. ప్రార్థన చేసింది.

మేరీ, రమా తమ భర్తల్ని వెంటబెట్టుకొని బంధువుల్ని కలిశారు. మిత్రులు చూచారు. క్లాస్ మేట్స్‌ని పలకరించారు. ఊరూ వాడా తిరగేశారు. ఆ ఊరూ ఈ ఊరూ పోయి వచ్చారు. ఊరి ఊరికి ఏగి వస్తున్నారు. జెండా కర్రల్లా ఊరేగుతున్నారు.

మేరి నుదుట సూర్యుడున్నాడు.

రమ నుదుట విశాల విశ్వం స్వచ్ఛంగా నిర్మలంగా, నిశ్చలంగా ఉంది.

★